మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
మంగళవారం | 21 | నవంబర్ | 2023 | పేజీలు : 8



## ముత్యంరెడ్డి ఆశయాలను ముందుకు సాగిస్తా

- ఒక్కసారి ఆశీర్వదించండి... అభివృద్ధి చేసి చూపిస్తా
- బీజేపి, బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు
- కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



8 లో

# ఓటంటే ఐదేళ్ల భవిత

- అండగా ఉన్నదెవరో ఆలోచించండి
- ఎట్లుండే గజ్వేల్ ఎట్లయింది?
- అబద్ధాల మాటలకు మోసపోవద్దు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు

జగదేవ్‌పూర్/ములుగు, నవంబర్ 20, మనం న్యూస్: ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుంది. ఓటంటే మొక్కుబడి కాదు.. ఓటంటే ఐదేళ్ల భవిష్యత్తు.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే అభివృద్ధి చెందుతామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఓటంటే కేవలం మూడొద్దుల మురిపెం కాదు.. ఐదేండ్ల భవిత... అభ్యర్థులను నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ పట్టణం, ములుగులో నిర్వహించిన రోడ్ షోల్లో మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నికలంటే అందరూ వస్తారు. అండగా ఉన్నదెవరో.. మిగతా 2లో..







## జయహో జన నేత

- అభివృద్ధికి అండగా.....భారీ మెజార్టీయే లక్ష్యంగా
- 3వ వార్డులో ఇంటింటి ప్రచారం



7 లో

## దుబ్బాకపై ఎగిరేది కాషాయ జెండాయే

- కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- కేంద్ర నిధులను రాష్ట్ర నిధులుగా చెప్పుకోవడం సిగ్గుచేటు
- ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు?
- దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు





దౌల్తాబాద్, నవంబర్ 20, మనం న్యూస్: దుబ్బాక గడ్డపై బీజేపి జెండా ఎగురడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని చెట్లనర్సంపల్లి, మాచిన్‌పల్లి, అప్పాయపల్లి, శేరిల మిగతా 2లో..





# ఓటంటే ఐదేళ్ల భవిత

మొదటి పేజీ తరువాయి..

అవసరం కోసం వచ్చిందెవరో ఆలోచించండి అన్నారు. చుక్క నీళ్లు లేని గజ్వేల్ నేడు నీటి గళగళలతో మురిపెంగా మారింది. గజ్వేల్‌ను అభివృద్ధి చేసింది కేసీఆర్ కాదా అన్నారు. సాగునీటితోపాటు తాగునీటి కష్టాలు తీరిపోయాయి. ఒకనాడు కూలీపని దొరకని చోట నేడు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నాం. నాడు కాన్పుకు పోతే రూ.40 వేలు, రూ. 50 వేలు లేనిదే ఆపరేషన్ అయ్యేది కాదు. నేడు ప్రభుత్వాసుపత్రులు బలోపేతం చేసి అత్యాధునిక వైద్యాన్ని అందిస్తూ రూపాయి ఖర్చు లేకుండా డెలివరీ చేస్తూ కేసీఆర్ కిట్ ఇస్తుంది నిజం కాదా అన్నారు. కాంగ్రెసోళ్లొస్తే మళ్లీ ఆసుపత్రులు పందులు, పందికొక్కులకు నివాసాలుగా మారుతాయన్నారు. కేసీఆర్ గజ్వేల్‌కు రాకముందు ఎంతో మంది ఎమ్మెల్యేలున్నారు, ఒక్కరూ నీళ్ల సమస్య పరిష్కరించలే. దొంగరాత్రి కరెంటుతో ఇబ్బందులు పడ్డాం... పాములు కుట్టి, కరెంటు షాకులతో రైతులు చనిపోయారు. నేడు 24 గంటల విద్యుత్‌తో రెండు పంటలు పండుతున్నాయన్నారు. ఒకనాడు రోడ్లను కనీసం రిపేర్ చేయని పరిస్థితులుండే. నేడు రింగు రోడ్లు, రేడియల్ రోడ్లతో గజ్వేల్ హాలతే మారిపో యిందన్నారు. పాండవుల చెరువు సుందరీకరణ, రామాలయం, శివాలయాల అభివృద్ధి, పత్తి మార్కెట్ నిర్మాణం, కలలుగన్న రైలుకూత తెచ్చిందెవరో ఆలోచించండి. కరోనా సమయంలో అండగా ఉన్నది మేము. పేషెంట్లకు ఇంటికెళ్లి ధైర్యం చెప్పాం. అప్పుడు రాని ఈటల రాజేందర్ ఇప్పుడెందుకొ చ్చాడో ఆలోచించండి. కష్టాల్లో ఒక్కనాడు రాని బీజేపోళ్లు ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టాలె అన్న బీజేపోన్ని గ్రామ పొలిమేరల్లోకి తరమాలన్నారు. ఎన్నికల సమయంలో ఇప్పుడొచ్చి నాకు చుట్టాలున్నారు, ఇక్కన్నే వ్యాపారం చేశా, రైతులు భూములు లాక్కుంటారా.. అంటూ తప్పుడు మాటలు చెబుతున్నాడని, వారి మాటలకు ఆగం కావద్దన్నారు. అబద్ధాల పునాదుల మీద ఓట్లు దండుకోవాలని వాళ్లు



చూస్తుంటే, కళ్ల ముందు కనిపించే అభివృద్ధి చూపించి ధైర్యంగా ఓటడుగుతున్నాం. అండగా ఉండండి...మూడవసారి ఆశీర్వదించండి అంటూ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి, ఎంపిపి అమరావతి, జెడ్పిటిసి పంగ మల్లేశం, నాచారం ఆలయ మాజీ ఛైర్మన్ కొట్టాల యాదగిరి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు, ఆత్మ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసి వైస్ ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్, బిఆర్ఎస్‌ప ట్టణ అధ్యక్షులు నవాజ్‌మీరా, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ చిలసాగరం ప్రవీణ్, రూబెన్, వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, చందన రవిందర్, రజిత షహనాజ్, శమీర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల పట్ల పూర్తి అవగాహనతో ఉండాలి


**-ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలి**

**-దుబ్బాక అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్**



దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 20, మనం న్యూస్ః ఈనెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వర్తించనున్న సిబ్బంది ఎన్నికల నిర్వహణ పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని మోడల్ స్కూల్‌లో అసెంబ్లీ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ తరగతులను దుబ్బాక ఎన్నికల సాధారణ అబ్జర్వర్ మన్మోహన్ ప్రసాద్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అధికారికి ఏ చిన్న సమస్య ఎదురైనా వెంటనే నోట్ చేసుకొని పై అధికారులతో చర్చించి పరిష్కరించుకో వాలని సూచించారు. వందశాతం ఎర్రర్ ఫ్రీ మైండ్‌తో విధులకు హాజరు కావాలని, ఈవియం మిషన్‌లు, బ్యాలెట్ బాక్సులు, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ మిషన్‌ల గురించి, వాటి అనుసంధానం గురించి, పలు అంశాలపై మాస్టర్ ట్రైనర్లు పూర్తిగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ రోజున నిర్వహంచే మాక్‌పోలింగ్ ప్రక్రియ గురించి క్షుణ్ణంగా వివరించి నమూనా పోలింగ్ ఎలా చేయాలో, విధులు ఎలా నిర్వర్తించాలో ఎన్నికల సిబ్బంది నేర్చుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దుబ్బాకపై ఎగిరేది కాషాయ జెండాయే



మొదటి పేజీ తరువాయి..

గ్రామాల్లో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క దళిత ఎమ్మెల్యేకు కూడా ంత్రి పదవి ఇవ్వలేదని, అలాంటి సీఎం కేసీఆర్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా సీఎం కేసీఆర్ మద్యం షాపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. దళితబంధు పేరుతో దళితులను, బిసి బంధు పేరుతో బిసిలను మోసం చేశారన్నారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నిరుపేదలకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండుసార్లు ఎంపిగా గెలిచి దుబ్బాక





నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో తెలియజేయాలన్నారు. గ్రామాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో నూతన ఒరవడి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తాను గెలిచిన మూడేళ్లలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసి తిరిగి మీ ముందుకు రావడం జరిగిందని, తనను ఆశీర్వదించి గెలిపించినట్లయితే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ దుబ్బాక నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. రేషన్ కార్డులు ఇవ్వని కేసీఆర్ సన్నబియ్యం ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషన్, ఉపాధ్యక్షులు గడ్డమీద స్వామి, కుమ్మరి నర్సింలు, భూపాల్‌రెడ్డి, రామస్వామి గౌడ్, ప్రభాకర్‌తోపాటు బీజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 26న దుబ్బాకకు సీఎం కేసీఆర్

## సభా స్థలిని పరిశీలించిన హరీష్‌రావు

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 20, మనం న్యూస్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆయా అభ్యర్థులకు మద్ధతుగా ప్రచారం నిర్వహిస్తూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఓటర్లను తనదైన శైలిలో ఆకట్టుకుంటూ వస్తున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్న దుబ్బాక నియోజకవర్గంలోనూ సీఎం కేసీఆర్ ఈనెల 26న సభ నిర్వహించనున్నట్లు మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ సభ ద్వారా దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారం నిర్వహించి నియోజకవర్గ ఓటర్లను ప్రసన్నం చేసుకొని, మరోసారి దుబ్బాక గడ్డపై బిఆర్ఎస్ జెండాను ఎగురవేసేందుకు వ్యూహం రచించినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం రోజున మంత్రి హరీష్‌రావు దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బాక దుంపలపల్లి మార్గమధ్యంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సభాస్థలాన్ని, హెలీప్యాడ్ స్థలాన్ని మంత్రి హరీష్‌రావు పరిశీలించారు. దుబ్బాకలో సీఎం కేసీఆర్ సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున ఈనెల 26న దుబ్బాకలో జరిగే సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దుబ్బాక అంటే కేసీఆర్‌కు ఎంతో అభిమానం, ప్రేమ అన్నారు. ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్ దుబ్బాకకు వచ్చి ఉంటే భారీ మెజార్టీతో గెలిచే వారిమని, బీజేపి నాయకులు మేకపోతు



గాంభీర్యాన్ని ప్రదర్శన చేస్తున్నారని విమర్శించారు. సొంత పార్టీ నాయకులపైనే బీజేపికి నమ్మకం లేదని, అలాంటి పార్టీ ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తుందో చెప్పాలన్నారు. బీజేపి రాష్ట్రంలో అధికారంలోకి రావడం కేవలం ఒక కల మాత్రమే అని, ఇప్పటికే బీజేపిలో ఉన్న విజయశాంతి, వివేక్, చంద్రశేఖర్ వంటి రాష్ట్ర స్థాయి నాయకులు, గ్రామస్థాయి నాయకులు బీజేపిని వీడి వెళ్తున్నారని, అలాంటి పార్టీకి కనీసం డిపాజిట్లు కూడా దక్కవని, ప్రజలకు బిజేపిపై విశ్వాసం లేదన్నారు. కావున ప్రజలు బీజేపి నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి బంగారు తెలంగాణ నిర్మాణానికి కృషి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు.



## బిఆర్ఎస్‌లో చేరిన ఖమ్మంపల్లి కాంగ్రెస్ నాయకులు

### మంత్రి హరీష్‌రావు సమక్షంలో పార్టీలో చేరిక

కొండపాక, నవంబర్ 20, మనం న్యూస్: కొండపాక మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం రోజున మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ అభ్యర్థి హరీష్ రావు సమక్షంలో మండల పరిధిలోని ఖమ్మంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై, కేసీఆర్‌ను మూడవాసిరి ముఖ్యమంత్రిగా చేయడానికి తామంతా బిఆర్ఎస్ వైపు నిలబడి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు , స్థానిక ఎంపిటిసి యాదగిరి, మాజీ సర్పంచ్ దామశంకర్, మండల నాయకులు మంద శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు వల్లంగళ్ల రాజేశ్, పెద్దోల్ల శేఖర్, వల్లంగళ్ల కనకయ్య, పెద్దసాయిగారి పరమేశ్వర్, వల్లంగళ్ల అనిల్, వల్లంగళ్ల స్వామిదాస్, వల్లంగళ్ల అనిల్‌కుమార్, తోళ్ల మల్లయ్య, రామసాగరం నర్సింలు, రాగపురం శివ, తోళ్ల కర్ణాకర్, రాజమౌళి, ప్రవీన్, తోళ్ల సంజీవ్ తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అనంతుల నరేందర్, గొట్టె ఐలయ్య ఉన్నారు.



## వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలి

### -కెమెరా గుర్తుకు ఓటేయాలని పల్లెటూరు ప్రసాద్ విజ్ఞప్తి

మిరుదొడ్డి, నవంబర్ 20, మనం న్యూస్: దుబ్బాక నియోజకర్గంతోపాటు రాష్ట్రంలో వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుబ్బాక నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పల్లెటూరి ప్రసాద్ అన్నారు. సోమవారం మిరుదొడ్డి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం గురించి అవగాహన లేని నాయకులకు రాజకీయ పార్టీలు టికెట్ కేటాయింపులు చేయడం చాలా దారుణమన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి చేసిన పనులను ప్రస్తావించడం తప్ప తాను గెలిచిన తర్వాత ఏం చేస్తాననేది స్పష్టంగా చెప్పలేకపోతున్నాడని కాంగ్రెస్ అభ్యర్థిపై ఆరోపించారు. నియోజకవర్గంపై పూర్తిగా అవగాహన కలిగి ఉన్న నాయకులనే ఎన్నుకోవాలని ఆయన సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కెమెరా గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

## మృతుని కుటుంబానికి పల్లా ఆర్థిక సాయం



చేర్యాల, నవంబర్ 20, మనం న్యూస్: చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన పల్లె రాజయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే స్పందించి ఆకునూరు బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు పాల బాలరాజు ద్వారా వారి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. వారి వెంట కోతి దాసు, పుప్పాల మహేందర్, పల్లె కనకయ్య, బి. రాములు, ఆంధ్రయ్య, యాదయ్య తదితరులున్నారు.

# పట్టాలు పొందిన ప్రజలపై దౌర్జన్యమా

### -భూ బాధితులకు అండగా నేనున్నా

### -అక్బర్ అనుచరులను హెచ్చరించిన నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, నవంబర్ 20, మనం న్యూస్: పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ గుట్టమీద గల సర్వే నెంబర్ 496లో 2007లో పట్టాలు పొంది ఇళ్లు కట్టుకున్న ప్రజల మీద దౌర్జన్యంగా దాడి చేసి అన్యాయంగా వారి ఇళ్లను అక్బర్, అతని అనుచరులు కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని నీలం మధు ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూములు తమకు పట్టా చేశాయని, ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని చెప్పినా వినకుండా ఇళ్లను కూల్చేయడం దౌర్జన్యమన్నారు. వారిని బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారని వారు వాపోయారు. తమకు ఇళ్లు లేకుండా చేశారని, తామెక్కడ ఉండాలని కుటుంబ సభ్యులతో పూర్తిగా రోడ్డున పడ్డామని బాధితులు విలపిస్తున్నారన్నారు. వారందరికీ అండగా ఉంటానని, వారికి ఎలాంటి ఆపద రాకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లు కట్టించి రెగ్యులరైజ్ చేయిస్తానని నీలం మధు ముదిరాజ్ వారికి ధైర్యం చెప్పారు. తమను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఈ




సందర్భంగా వారు నీలం మధు ముదిరాజ్‌కు రుణపడిఉంటామన్నారు. అమాయకులైన ప్రజలపై దౌర్జన్యం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకునే వరకు పోరాడుతామన్నారు.





## ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి

### అన్నపూర్ణ విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



గజ్వేల్, నవంబర్ 20, మనం న్యూస్: ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని, అన్నపూర్ణ విఘ్నేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా పూజలు నిర్వహించి లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు ఉదయం నుండే ఆలయాలకు పెద్ద ఎత్తున రావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నేతి శ్రీనివాస్ గుప్త అన్నపూర్ణ విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని కార్తీక మాసంలో భగవంతున్ని ప్రార్థించడంతోపాటు గర్భగుడిలో శివుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించడం ద్వారా భగవంతుని ఆశీస్సులు అందుతాయన్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అన్నపూర్ణ విఘ్నేశ్వరాలయం ప్రతి ఒక్కరు దర్శించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, ఆలయ కమిటీ అధ్యక్షులు జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బీజేపిలకు ఓటేస్తే ఆగమే

### -ప్రజలను నమ్మించి మోసం చేసిన బిఆర్ఎస్

### -జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కొమురవెల్లి, నవంబర్ 20, మనం న్యూస్ః బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి రాష్ట్రంలో ఎన్నడూ జరగలేదని, ఏ రంగం కూడా అభివృద్ధి సాధించలేని, పథకాల పేరుతో ప్రజలకు ఆశ చూపి అమలు చేయకుండా నమ్మించి మోసం చేశారని జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి, ఐనాపూర్, కిష్టంపేట, గౌరాయపల్లి, మర్రిముచ్చాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుండి సిద్దిపేటకు నీటిని దొంగతనంగా తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీరు వెళ్లకుండా అడ్డుకుంటామన్నారు. తన హయాంలో ఈ ప్రాంతానికి 86 వేల ఎకరాలకు గోదావరి నీటిని అందించామని, కాలువల నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు. ఉద్యమకారులను విస్మరించి ఉద్యమద్రోహులను తమవెంట ఉంచుకున్నారని విమర్శించారు. స్థానికేతరుడైన ముత్తిరెడ్డి నియోజకవర్గాన్ని దోచుకున్నాడని విమర్శించారు. అలాంటి వ్యక్తి మాటలు నమ్మి మోసోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపటిసిలు కొయ్యడ రాజమణి శ్రీనివాస్, లింగంపల్లి కవిత కనకరాజు, నాయకులు మేడికుంట శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు మహదేవుని శ్రీనివాస్, కొమ్ము నర్సింగ్, రవి, లింగంపల్లి శ్రీనివాస్, సార్ల లింగం, ఎక్కలదేవి శ్రీనివాస్, ప్రవీణ్, బిక్షపతి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.





## అభివృద్ధిని చూసి ఆదరించండి

### ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్



కొండపాక, నవంబర్ 20, మనం న్యూస్ః ప్రజలు అభివృద్ధిని చూసి మరోసారి కేసీఆర్‌ను ఆదరించాలని ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలో స్థానిక సర్పంచ్ కర్రే లక్ష్మి రాజయ్య, ఎంపిటిసి హరిత సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల భద్రప్పతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటా వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే కేసీఆర్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపి పార్టీని నమ్ముకుంటే అధోగతి అవుతుందని, మోసపోతే గోసపడుతామన్నారు. రాష్ట్రంలో రైతులు బాగుపడాలంటే కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావాలని, రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేయని కేంద్ర ప్రభుత్వానికి ఓట్లతో బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్ చారి, గ్రామ కమిటీ అధ్యక్షులు చరణ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఇసాల కరుణాకర్, ఈశ్వరప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా మహిళ సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి




సంగారెడ్డి, నవంబర్ 20, మనం న్యూస్ః పాఠశాల స్థాయి నుండే బాలల హక్కులపై బాలబాలికలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అదేవిధంగా మహిళా సంరక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైతం పలు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి అన్నారు. సోమవారం రోజున సంగారెడ్డి జెడ్పిహెచ్ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పాటల పోటీలు, ఉపన్యాసాలు, నృత్య పోటీలు, సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించండి... ఆడపిల్లలకు చదువు చెప్పండి అనేది భారతదేశంలోని బాలికల సంక్షేమం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. బాలికల చదువు భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. కావున బాలికలు పాఠశాల స్థాయి నుండే ఒకలక్ష్యాన్ని ఎంచుకొని ఉత్తమంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పోలీస్ ఆఫీసర్ రఘు, డిసిఆర్‌బి సిఐ రమేష్, డిఈఓ వెంకటేశం, మాధురి, ఉమెన్ పోలీస్ ఎస్ఐ సోమేశ్వర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



## నేడు దౌల్తాబాద్‌లో యువజన గర్జన సభ

### -హాజరుకానున్న మంత్రి కేటీఆర్



దౌల్తాబాద్, నవంబర్ 20, మనం న్యూస్ః దుబ్బాక గడ్డ మీద బిఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని జిల్లా కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రహీమొద్దీన్ అన్నారు. నేడు దౌల్తాబాద్‌లో దుబ్బాక నియోజకవర్గ యువగర్జన సభకు మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన బిఆర్ఎస్ పార్టీకి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు దౌల్తాబాద్‌లో జరిగే రోడ్ షో కార్యక్రమంలో దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి, ఎంపి ప్రభాకర్ రెడ్డితో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారకరామారావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై యువకులు బైక్ ర్యాలీ ద్వారా కార్యక్రమానికి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ కలీలుద్దీన్, నర్ర రాజేందర్, స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పబ్బా అశోక్, నాగరాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

### -ప్రజలు నా వెంట ఉన్నారు

### -కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్



పటాన్‌చెరు, నవంబర్ 20, మనం న్యూస్ః పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, బసవేశ్వర విగ్రహం నుండి రోడ్ షోగా బయల్దేరి శాంతినగర్, ఎంజి. రోడ్ మీదుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీలో చేరిన బిఆర్ఎస్ మైనార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును చేతి గుర్తుపై వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నాని, కాంగ్రెస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కావున ప్రజలు ఆచితూచి హస్తం గుర్తుకు ఓటేసి తనకు అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టియుసి ప్రెసిడెంట్, టౌన్ ప్రెసిడెంట్ నరసంహారెడ్డి, సిపిఐ కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌రావు , సంగారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ చిన్న ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షులు రాజశేఖర్, డిసిసి కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, జయమ్మ రాములు, శ్రీహరి, నాయకులు మక్బుల్, ఆసిఫ్, హర్షద్, యువరాజ్, సాయి ముదిరాజ్, జహంగీర్, ఉమట్, జబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈటెల రాజేందర్ గెలవాలని శివాలయంలో పూజలు

### -మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుభాష్‌చంద్రబోస్



గజ్వేల్, నవంబర్ 20, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం గడీల పాలనలో బంధీ అయిందని, బడుగు బలహీన వర్గాల ఆశా కిరణం గజ్వేల్ బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షిస్తూ మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ స్థానిక అన్నపూర్ణ విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి గజ్వేల్ నుండి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపి అధికారంలోకి రావడం ఖాయమని, ప్రతి ఒక్కరు బీజేపి పార్టీ వైపే ఉన్నారని, గజ్వేల్ నుండి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని, లక్షకు పైగా మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ఓటమి గజ్వేల్ నుండే ఖాయమని, అదే స్థానంలో ఈటల గెలుపు ఖాయమని, ప్రజలకు మంచి రోజులు త్వరలోనే రానున్నాయన్నారు

# అభివృద్ధిని చూసి ఓటేయండి

### -కారుకు ఓటు ప్రగతికి బాట

### -బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి



జిన్నారం, నవంబర్ 20, మనం న్యూస్ః ప్రజలు బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి, భవిష్యత్ అభివృద్ధి కోసం బిఆర్ఎస్‌కు ఓటేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. సోమవారం జిన్నారం మండల పరిధిలోని జగంపేట, పెద్దమ్మ గూడెం, జిన్నారం, ఊట్ల, సోలక్పల్లి, రాళ్ల కత్వా, శివనగర్, ఇమామ్‌నగర్, మంగంపేట, తుల్లగూడెం గ్రామాల పరిధిలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లు, మంగళహారతులు సాంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది కాలంలో తెలంగాణ బతుకు చిత్రాన్ని మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. వ్యవసాయం, నీటి పారుదల, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. జిన్నారం మండల పరిధిలోని ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలతోపాటు సిఎస్ఆర్ సొంత నిధులతో రహదారులు, ఆలయాలు, పాఠశాలలు, మసీదులు నిర్మించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందించామన్నారు. 60 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కావున ప్రజలు ఈసారి ఎన్నికల్లో ఓటు వేసే ముందు పునరాలోచించుకొని కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పి వైస్ ఛైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, పార్టీ అధ్యక్షులు రాజేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.





## బీజేపితోనే అభివృద్ధి సాధ్యం

### -మార్పు గజ్వేల్ నుండే మొదలవ్వాలి

### -బీజేపి నాయకురాలు శమిత

ములుగు, నవంబర్ 20, మనం న్యూస్ః రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అరాచక పాలనకు అంతం, అభివృద్ధి, సంక్షేమానికి నాంది గజ్వేల్ నుండే మొదలవ్వాలని గజ్వేల్ బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు, బీజేపి నాయకురాలు శమిత అన్నారు. సోమవారం రోజున ములుగు మండలం దాసర్లపల్లి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ నుండి బిజేపిలోకి శమిత ఆధ్వర్యంలో మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ సమక్షంలో పలువురు బీజేపిలో చేరారు. ఈ సందర్భంగా బీజేపి నాయకురాలు శమిత మాట్లాడుతూ బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్ గజ్వేల్‌లో గెలుపు ద్వారానే రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న బిఆర్ఎస్ అవినీతి అరాచకాలకు చరమగీతం పాడాలని, అభివృద్ధికి నాంది పలకాలన్నారు. కేసీఆర్‌కు ఈటల రాజేందర్ అంటే భయం కాబట్టే ఎన్నడూ లేని విధంగా ప్రచారాలు నిర్వహిస్తూ, తన అల్లుడు హరీష్‌రావు ద్వారా బిఆర్ఎస్‌ను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. గజ్వేల్‌లో ఈటల రాజేందర్ కేసీఆర్‌పై నామినేషన్ వేసిననాడే ఈటల గెలుపు ఖాయమైందని, కేవలం బీజేపికి గజ్వేల్‌లో మెజార్టీ కోసమే ప్రతి బీజేపి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

# బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్

### -ప్రచారంలో స్పీడు పెంచిన కాంగ్రెస్ పార్టీ

### -ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, నవంబర్ 20, మనం న్యూస్ః బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఈసారి ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలో మండల పార్టీ అధ్యక్షుల కేశిరెడ్డి రవిందర్‌రడెఇ్డ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈస ందర్భంగా అనంత సాగర్, తిమ్మాపూర్, బస్వాపూర్, వట్టిపల్లి, పలుగుగడ్డ, మాందాపూర్, మునిగడప గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. బీజేపి, బిఆర్ఎస్ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానన్నారు. బీజేపి, బిఆర్ఎస్‌లు మాయమాటలతోనే ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. బిఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పూర్తిగా దొరల పాలన సాగుతుందని, దొరల పాలన పోవాలంటే ప్రజా రంజక పాలన రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ



కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఎంపిటిసిలు కేశమైన మహేష్ యాదవ్, మహేందర్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల బంగారెడ్డి, అమెర రాము, పైతరి నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, జుర్రు రాజు, రాచకొండ కృష్ణ, చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

### -ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

### -సిద్దిపేట రూరల్ సిఐ చేరాలు



సిద్దిపేట రూరల్, నవంబర్ 20, మనం న్యూస్ః ప్రజాస్వామ్య దేశంలో ఓటు గొప్పదని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామని సిద్దిపేట రూరల్ సిఐ చేరాలు అన్నారు. సోమవారం సిపి ఆదేశానుసారం చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంచ, గుర్రాలగొంది, జక్కాపూర్, కేశవాపూర్, మోత్కులపల్లి గ్రామాల్లో చిన్నకోడూరు ఎస్ఐ సుభాష్ గౌడ్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు కల్పించిన ఓటు హక్కును నిర్భయంగా ఎవరికైనా నచ్చిన వ్యక్తికి వేసుకోవచ్చన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపించడానికి అన్ని రకాల ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని, 30న పోలింగ్ నాడు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950కి కాల్ చేయాలని సూచించారు. సి విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



# ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు



### జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్

### సోనమ్ టెన్సింగ్ బూటియా

సిద్దిపేట, నవంబర్ 20, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల ప్రశాంత వాతావరణానికి ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ బూటియా అన్నారు. సోమవారం ఎన్నికల అబ్జర్వర్ జయశ్రీ బోజాతో కలసిఇ పుల్లూరు, రాజ్‌గోపాల్‌పేటలో వికలాంగుల ఇండ్లను సందర్శించి వారు వేస్తున్న ఓటింగ్ సరళిని పరిశీలించారు. భూంపల్లి పోలీస్ స్టేషన్, గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పోలింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఏ అంశమైనా ప్రజల దృష్టికి వస్తే 87126 67309 మొబైల్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# ముమ్మరంగా పద్మారెడ్డి ప్రచారం

## ఘనంగా స్వాగతం పలికిన ప్రజలు



నిజాంపేట, నవంబర్ 20, మనం న్యూస్‌: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ, నందిగామ, బచ్చురాజ్‌పల్లి, చౌకత్‌పల్లి, తిప్పనగుల్ల, వెంకటాపూర్ కే, రజక్‌పల్లితోపాటు పలు గ్రామాల్లో పద్మా దేవేందర్‌రెడ్డికి బోనాలు, బతుకమ్మలు, మంగళహార తులతో సాంప్రదాయంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలో ఉన్న వారు ఐదు గంటలు కరెంటు మాత్రమే ఇచ్చారని, కానీ దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంటు ఇస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి గ్రామీణ ప్రాంతాలు, గడప గడపకు అందుతున్నాయని ఆమె కొనియాడారు. అనంతరం నూతన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. మైనంపల్లి హనుమంతరావు రెండుసార్లు గెలిచి ఏం చేయలేదని విమర్శించారు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ సంస్కారం లేని విధంగా రోహిత్ మాట్లాడుతున్నాడని, ముందు సంస్కారం తెలుసుకొని ఓట్లు అడగడానికి రావాలన్నారు. దొంగ మాటలతో దొంగ హామీలతో ప్రజల్లోకి రావద్దని, ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దేశెట్టి సిద్ధిరాములు, సుధాకర్‌రెడ్డి, అందె ఇందిరా కొండల్‌రెడ్డి, బిజ్జు విజయలక్ష్మి, సంపత్, అమరసేనారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, అబ్దుల్ స్వామి గౌడ్, దేశెట్టి లింగం నగేష్ యాదవ్, వెంకట్ గౌడ్, ఎల్లం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప సర్పంచ్ శేఖర్

### -ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వస్తాం

నిజాంపేట, నవంబర్ 20, మనం న్యూస్‌: మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లోకి ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, నాయకులు చేరారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నామసాని శేఖర్, వార్డు సభ్యులు రాజు, స్వామిలు సోమవారం మైనంపల్లి హనుమంతరావు స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, కాంగ్రెస్ పార్టీ ఆరు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేందర్, మండల అధ్యక్షులు మారుతి, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, మండల సేవాదళ్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ముసుగులో అరాచకాలు

### -ఒక్కసారి అవకాశమిస్తే జరిగింది అభివృద్ధో, అవినీతో తేల్చుతా
### -దుబ్బాక నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పల్లెటూరి ప్రసాద్



దౌల్తాబాద్, నవంబర్ 20, మనం న్యూస్‌: గడిచిన పదేళ్లలో దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి శూన్యమని, మూడేళ్లలో పాత పనులకే కొత్తగా ఎమ్మెల్యే, ఎంపిలు ముచ్చట్లు చెబుతున్నారని దుబ్బాక నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పల్లెటూరి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపి ప్రభాకర్‌రెడ్డి తొమ్మిదేళ్లలో దుబ్బాకలో ఎక్కడా కనబడలేదన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే రఘునందన్ రావు గువ్వలేగిలో ఉన్న అంబేద్కర్ చౌరస్తాలో కులమతాల పేరుతో చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఇద్దరు కలిసి దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో కుంటుపడేలా చేశారన్నారు. ప్రభుత్వం పేరుకే క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికలు, పల్లె ప్రగతి వనాలు స్మశాన వాటికలు వంటివి చేశాయని, కానీ వాటిని వినియోగించుకుంటున్న దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. మొండిచింత నుండి ఇందుప్రియాల్ వరకు ఉన్న రోడ్డును చూస్తేనే వీరు చేసిన అభివృద్ధి అర్థమవుతుందని మండిపడ్డారు. ఎంపిపై జరిగిన దాడి ఘటనలో అనవసరంగా బిఆర్ఎస్ నేతలు దళిత జర్నలిస్టుపై దాడి చేయడం బాధాకరమన్నారు. కొందరు నేతలు అధికార మ దంతో ప్రోత్సహిస్తున్నారని మడిపడ్డారు. దుబ్బాక స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం

### -సుమారు రూ.5 లక్షల వరకు నష్టం



దుబ్బాక టౌన్, నవంబర్ 20, మనం న్యూస్‌: గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైన సంఘటన సోమవారం దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. ఎవరు లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణాపాయం తప్పింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధజలోని 13వ వార్డుకు చెందిన చెక్కపల్లి రాజు సతీమణి సౌందర్యకు ముగ్గురు పిల్లలున్నారు. వారు నివసిస్తున్న గుడిసె పక్కన చిన్న ఇల్లు కట్టుకోవడానికి ఏర్పాటు చేసుకున్నారు. ఈ కక్రమంలో తనకు తెలిసిన వ్యక్తుల వద్ద నుండి రూ. 2 లక్షలు అప్పుగా తీసుకొని ఇంట్లో దాచుకున్నాడు. దీంతోపాటు మరో రూ. 50 వేలు ఉన్నట్లు తెలిపారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. ఒక్కసారిగా భారీ శబ్ధం రావడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే రాజు కుటుంబం నివసిస్తున్న గుడిసెలో నుండి మొదటగా మంటలు వచ్చి సిలిండర్ పేలడంతో పూర్తిగా ఇంట్లోని డబ్బులు, సర్టిఫికేట్‌లు, సామాగ్రి ధ్వంసమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రాజు నూతన ఇంటి నిర్మాణం కోసం తీసుకువచ్చిన డబ్బులు, ఇతరత్రా కాలిపోవయ్యాయని కన్నీటిపర్యంతమయ్యాడు. సుమారు ఐదు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని వాపోయాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





## గోమాతను పూజిద్దాం

### బజరంగ్‌దళ్ మండల అధ్యక్షులు బోల కృష్ణ



నిజాంపేట, నవంబర్ 20, మనం న్యూస్‌: సకల దేవతా స్వరూపమైన గోమాతను పూజిద్దామని బజరంగ్‌దళ్ పాపన్నపేట మండల అధ్యక్షులు బోల కృష్ణ అన్నారు. గోపాష్టమిని పురస్కరించుకొని సోమవారం పాపన్నపేట మండలం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ శాఖల ఆధ్వర్యంలో పేరూరు సరస్వతి దేవాలయం వద్ద గల గోశాలలో గోమాతలకు గోపూజ చేశారు. శివలింగం, విగ్రహాలకు అభిషేకం చేశారు. అంతకుముందు మంజీరా నది ఒడ్డున వెలిసిన సరస్వతీ మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మహేష్ శర్మ వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట మండల బజరంగ్‌దళ్ అధ్యక్షులు బోల కృష్ణ, బత్తిని దుర్గా ప్రసాద్, చరణ్, ముమ్మని హరీష్, గంజి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌లు సేకరిస్తున్న అధికారులు



కొండపాక, నవంబర్ 20, మనం న్యూస్‌: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో పోస్టల్ బ్యాలెట్‌లను అధికారులు సేకరిస్తున్నారు. కొండపాక మండలంలో 88 మంది వృద్ధులు, 33 మంది దివ్యాంగులకు, కుకునూరుపల్లి మండలంలో నలుగురు దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారికి అందించారు. అధికారులు వాటిని సోమవారం సేకరించారు. తిమ్మారెడ్డిపల్లి, దుద్దెడ తదితర గ్రామాల్లో పోస్టల్ బ్యాలెట్లను అధికారులు సేకరించారు.

# జయహో జన నేత

సిద్దిపేట, నవంబర్ 20, మనం న్యూస్ ప్రతినిధిః అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సిద్దిపేటను అన్ని రంగాల్లో ఐకాన్‌గా మార్చిన హరీష్‌రావు వెంటే మేమంతా అంటూ జనం జై కొడుతున్నారు. అభివృద్ధికి అండగా ఉంటామని, రికార్డు మెజార్టీయే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రచారంలో గులాబీ దండు జోరు పెంచింది. సోమవారం నాడు పట్టణంలోని 3వ వార్డులో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు, వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేసీఆర్ నగర్, ఆదర్శ్ నగర్, మహాశక్తి నగర్, టెలికామ్ నగర్, మారుతి నగర్‌లో ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ హరీష్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ ఐలయ్య, ముత్యాల కనకయ్య, రాంచంద్రారెడ్డి, సత్యం, పప్పుల కర్ణాకర్‌రెడ్డి, లక్కిరెడ్డి అనితారెడ్డి, రామోజుల నిర్మలలు పాల్గొన్నారు.

### –నెహ్రూ పార్కు సమీపంలో...

పట్టణ మున్సిపల్ ఛైర్మన్ ఆదేశానుసారం బిఆర్ఎస్ మహిళా నాయకురాలు కాసనగొట్టు స్వప్న ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు నుండి పాత వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు ఇంటింటికి తిరుగుతూ హరీష్‌రావును గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి నాయకుడు హరీష్‌రావుకు లక్షా యాభై వేల ఓట్ల మెజార్టీ అందించాలని ఆమె ఇంటింటికి ప్రచారం చేస్తూ కోరారు. ఆమె వెంట శోభ, సంగీత, అమరేశ్వరీ, దానమ్మ, వజ్రమ్మ, శ్వేత, జ్యోతిలు పాల్గొన్నారు.



### –చింతమడకలో గులాబీ గుబాళింపు

కేసీఆర్ పుట్టిన గ్రామం చింతమడక మదిర గ్రామమైన దమ్మ చెరువులో గులాబీజెండాలతో డప్పు చప్పుళ్లతో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ప్రజలందరూ ఏకతాటిపై ఉండి తామంతా కేసీఆర్, హరీష్‌రావు వెంటేనని ముక్తకంఠంతో నినదించారు. ర్యాలీ అనంతరం నాయకులు మాట్లాడుతూ పుట్టిన ఊరికి మేలు చేయాలనే సదుద్దేశంతో కేసీఆర్ పక్కా ఇండ్లను, ఆర్ధికంగా రూ.10 లక్షలు ప్రతి ఇంటికి అందించారని, భవిష్యత్తు బాగుండాలంటే బిఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం ఇర్కోడు గ్రామంలో జరిగిన ప్రచార ర్యాలీలో నాయకులు పాల్గొని గడప గడపకు ప్రచారం చేశారు. బాణాసంచాలతో, డప్పుచప్పుళ్లతో ప్రచారాన్ని హోరెత్తించారు. నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్‌తోనే ప్రజలకు భరోసా అని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బిఆర్ఎస్ పని చేస్తుందన్నారు. ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేసీఆర్, హరీష్‌రావుదే అన్నారు. భవిష్యత్తులో ఇంకా బాగుండాలంటే బిఆర్ఎస్‌కే ఓటేయాలన్నారు. ఎవరెన్ని మాటలు చెప్పినా మోసపోకుండా కారు గుర్తుకే ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, ఎంపిపి గన్నమనేని శ్రీదేవి, జెడ్పిటిసి కోటగిరి శ్రీహరి గౌడ్, వైస్ ఎంపిపి శేరుపల్లి యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపిపి ఎర్ర యాదయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు , నాయకులు రాంచందర్‌రావు, బాలకిషన్‌రావు, పిఎసిఎస్ ఛైర్మన్ నల్ల నారేందర్‌రెడ్డి, ఎంపిటిసి జ్యోతి దేవేందర్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**–చిన్నకోడూరులో....** గులుగుడు గులుగుడే.. గుద్దుడు గుద్దుడే అంటూ బిఆర్ఎస్ ఎన్నికల ప్రచార పాటలతో రామునిపట్ల, గోనెపల్లి గ్రామాలు





హోరెత్తాయి. గెలుపు పక్కా, లక్షా యాభై వేల మెజార్టీ అందిద్దామంటూ బిఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించాయి. బిఆర్ఎస్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపిపి మాణిక్యరెడ్డిలు ఓట్లను అభ్యర్థించారు. కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెసోళ్లను నమ్మవద్దని, మేకపోతు గాంభీర్యం ప్రదర్శించే బీజేపోళ్లవైపు చూడొద్దంటూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. రామునిపట్లలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సంఘం, సుతారి సెంట్రింగ్ సంఘం, గోనెపల్లిలోచాకలి ఐలమ్మ రజక సంఘం సభ్యులు మా ఓట్లన్నీ హరీష్‌రావుకే అంటూ ఏకగ్రీవ తీర్మానం చేసి తీర్మాన పత్రాన్ని అందించారు. సర్పంచ్‌లు జేరిపోతుల శ్రీనివాస్, స్వరూప ఎల్లా గౌడ్, సొసైటీ ఛైర్మన్‌లు సదానందం, కనకరాజు, మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**–నంగునూరులో...** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఏఎంసి ఛైర్మన్ రాగుల సారయ్య, జెడ్పిటిసి తడిసిన ఉమ, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, తెరాస మండల పార్టీ అధ్యక్షులు అనగోని లింగం గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని, ఎన్నికలు రాగానే ఇతర పార్టీల నాయకులు వచ్చి చెప్పే మాయమాటలు విని మోసపోవద్దని ప్రజలకు సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ ఎన్నికల్లో హరీష్‌రావు గెలుపు ఖాయమని, ఎన్నడూ లేని విధంగా లక్షా యాభై వేల మెజార్టీతో గెలిపిద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఎంపిటిసి తులసి, ఉప సర్పంచ్ ఓజాల్, సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, వేముల వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వేణు చక్రవర్తి, వేల్పుల అయిలయ్య, దుంబాల శ్రీనివాస్, శామంతుల కనకరాజు, తెరాస గ్రామశాఖ అధ్యక్షులు వెంకట్, రంగు రమేష్ గౌడ్, బయ్యారం దామోదర్, కాయిత రాములు, శిలే ప్రశాంత్, సుండు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



















# దుబ్బాక అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

**-ప్రజల ఆశీస్సులతో త్వరలోనే ప్రజల్లోకి ప్రభాకర్‌రెడ్డి**

**-మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దు**

**-దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత**





దుబ్బాక, నవంబర్ 20, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కేవలం సీఎం కేసీఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బిఆర్ఎస్ పార్టీ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత అన్నారు. సోమవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి, పద్మనాభునిపల్లి, తిమ్మాపూర్, హబ్సిపూర్ గ్రామాల్లో జెడ్పి ఛైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్యం కుదుట పడుతుందని, త్వరలోనే మీ అందరిలోకి రానున్నారని, ఆయనే స్వయంగా ప్రచారంలో సైతం పాల్గొంటారన్నారు. ప్రజల నుండి ప్రభాకర్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అనవసర, నిరాధార ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని, వాటన్నింటికీ ప్రజలే ఓటుతో సరైన బుద్ధి చెప్తారన్నారు. ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లోకి రాకముందే కేపీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. రాష్ట్రంలో బిజేపి, కాంగ్రెస్ పార్టీల మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని, సాధించుకున్న తెలంగాణ అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, దుబ్బాక నియోజకవర్గం కొత్త ప్రభాకర్‌రెడ్డి ద్వారానే అభివృద్ధి దిశగా పరుగులు పెట్టనుందన్నారు. కావున ప్రజలంతా ఈసారి ఎన్నికల్లో తమ విలువైన ఓటును కారు గుర్తుకు వేసి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.

-మిరుదొడ్డిలో.... దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆత్మ కమిటీ ఛైర్మన్ భాస్కరాచారి అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపి నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గత ఉప ఎన్నికల్లో బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి



చేయకుండా మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. కావున ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఆలోచించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తుంటే మేము కారు గుర్తుకే ఓటేస్తామని ప్రజలు ముందుకు రావడం జరుగుతుందని టిఆర్ఎస్ జిల్లా నాయకులు గొల్ల రాములు, ఎలుముల స్వామి, దార స్వామి అన్నారు. సోమవారం ఆయా బూత్‌లలో ఇంటింటి ప్రచారాన్ని బిఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో జరగని అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో దుబ్బాక నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఈఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిరినేని వెంకటయ్య, ఎలుముల శేఖర్, పసులకాడి తిరుపతి, గొట్టం స్వామి, నక్క రాజయ్య, కొమురయ్యతోపాటు తదితరులు ఉన్నారు.







# ముత్యంరెడ్డి ఆశయాలను ముందుకు సాగిస్తా

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 20, మనం న్యూస్ః మాజీమంత్రి, దివంగత నేత ముత్యంరెడ్డి కుమారుడిగా ఆయన ఆశయాలను తాను ముందుకు సాగిస్తానని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం చేగుంట మండలం కసాన్‌పల్లి, చందాయిపేట, గోపాల్‌పూర్, పెద్ద శివునూరు తాండ, చిన్న శివునూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఏ నాయకుడు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. చేగుంటలో కళాశాల ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్, ఎస్టీ గురుకుల పాఠశాల, ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్, గోదాముల నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ముత్యంరెడ్డికే దక్కిందన్నారు. గత పదేళ్లలో ఎంపిగా గెలిచిన ప్రభాకర్‌రెడ్డి, మూడేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్‌రావులు ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రజలు గుర్తించాలన్నారు. కావున ప్రజలు ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని, ముత్యంరెడ్డి వారసుడిగా ఆయన అభివృద్ధి ఆకాంక్ష మేరకు అభివృద్ధి పనులు కొనసాగిస్తానన్నారు. నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి, రఘు నందన్‌రావు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని, మరోసారి వారి మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్, రాంపూర్ సర్పంచ్ కాశబోయిన భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అజ్మతుల్లా, కాంట్రాక్టర్ రాజు, శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





